క్లుప్తంగా

సీఎం సహాయనిధికి విరాళం

వనపర్తి: ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన వారికి అండగా ఉంటామంటూ జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులు ముందుకు వచ్చారు. ఈ మేరకు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం రూ. 6,21,100 విరాళంగా అందజేశారు. విరాళాలు అందించిన ఇంటర్ విద్యార్థులు, ఆయా కళాశాలల యాజమాన్యాలను అడిషనల్ కలెక్టర్ సంచిత్ గాంగ్వార్ ప్రశంసా పత్రంతో సత్కరించారు.

విగ్రహాల ఏర్పాటుకు..



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో యశోదదేవి, నందుడు విగ్రహాల ఏర్పాటుకు సంకిరెడ్డిపల్లికి చెందిన ఎన్ఆర్ఐ అమర్‌రెడ్డి రూ. 3 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సత్యంయాదవ్, బాలకొండయ్య యాదవ్, శివన్నయాదవ్, రాజారాం, శంకర్, పెంటన్న, న్యాయవాది యాదగిరి, బాలేమియా, ముస్తఫా, సాయిరాం పాల్గొన్నారు.

పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి

కొత్తకోట: తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. కొత్తకోటలో శుక్రవారం టీటీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ సభ్యత్వాలను అధిక మొత్తంలో నమోదు చేసి.. పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, రాఘవులు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మూలమల్ల గ్రామానికి చెందిన ప్రవీణ్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. శ్రీను, మాసన్న, దండు శ్రీను, సోంబాబు, అరుణ్‌కుమార్, జానకీ రాములు, అజయ్‌కుమార్, కిషోర్, రాంబాబు, సిద్దూ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం : కేసు నమోదు


రాకేష్

గోపాల్‌పేట: మండలంలోని ఏదట్లకు చెందిన కురుమూర్తి కుమారుడు రాకేష్ అదృశ్యమైనట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. మితిస్థిమితం సరిగాలేని అతడు గత నెల 31న ఇంటి నుంచి గోపాల్‌పేటకు వచ్చి.. తిరిగి వెళ్లలేదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ మాత్రం ఫలితం లేకపోయిందన్నారు. రాకేష్ తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వేలో తప్పులకు తావివ్వొద్దు

వనపర్తి రూరల్/ఆత్మకూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులకు తావివ్వొద్దని డీఆర్డీఓ యాదయ్య అన్నారు. శుక్రవారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం తండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో వివరాల నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. డీఆర్డీఓ వెంట ఎంపీడీఓ రాఘవ, పంచాయతీ కార్యదర్శి రేణుక ఉన్నారు.

❒ ఆత్మకూర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తహసీల్దార్ చాంద్‌పాషా, మున్సిపల్ కమిషనర్ శశిధర్, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి పరిశీలించారు. మున్సిపాలిటీలో 95 శాతం సర్వేను పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు స్థానిక జాతర మైదానాన్ని పరిశీలించారు.





జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో..


జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో..


పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాలలో..


పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో..

సావిత్రిబాయి జీవితం ఆదర్శనీయం

- ఘనంగా తొలి మహిళా ఉపాధ్యాయురాలి జయంతి
- పాఠశాలల్లో టీచర్లకు సన్మానం


కొత్తకోట చౌరస్తాలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో మహిళా టీచర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సావిత్రీబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని.. ఆమె ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని పలువురు పిలుపునిచ్చారు.

❒ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సావిత్రిబాయి జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పాల్గొని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఐఈఓ ఎర్ర అంజయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అదే విధంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన నివాసంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, అశోక్ పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులు కళావతమ్మ, గోపాలకృష్ణ, జయమ్మ, జయశ్రీ, జ్యోతి, నాగమణి తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పూలే చిత్రపటానికి మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాం ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దగూడెం, చిట్యాల ఉన్నత పాఠశాలల్లో మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు గిరిరాజాచారి, నరసింహ శర్మ, బండలయ్య, మండ్ల దేవన్న నాయుడు, గంధం నాగరాజు, బాలేమియా, కిరణ్‌చారి, గణేష్ పాల్గొన్నారు.

❒ కొత్తకోట పట్టణంలోని చౌరస్తాలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి దారి చూపిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, గాడిల ప్రశాంత్, అయ్యన్న, నాగన్న, లక్ష్మీకాంత్‌రెడ్డి, వినోద్ సాగర్, జగన్మోహన్‌రెడ్డి, పసుపుల నెహ్రూ, రవీందర్‌రెడ్డి, నాగబాబు, రాజు, మహేష్ పాల్గొన్నారు. అదే విధంగా మిరాసిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం మిద్దె సత్యనారాయణ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

❒ పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీలు, పంచాయతీ కార్మికులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, భాగ్యమ్మ, లక్ష్మి, సునీత, శ్రీనివాసులు, నర్సింహ పాల్గొన్నారు.

❒ పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు దావాజిపల్లి, చింతకుంట పాఠశాలల్లో సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

❒ అమరచింతలో కేవీపీఎస్, అంబేడ్కర్ జాతర కమిటీ, డీబీహెచ్ఎస్ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా టీచర్లకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, అజయ్, రమేష్, రవీందర్, అబ్రహం, రవి, విజయ్, అర్జున్, దేవరాజ్, నర్సింహులుగౌడ్, చిన్నబాలరాజు పాల్గొన్నారు.

❒ ఆత్మకూర్ మున్సిపల్ కార్యాలయంతో పాటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు గోపాల్, భాగ్యవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మహిళా అధ్యాపకులను సన్మానించారు.

❒ మదనాపురం మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, తిర్మలాయపల్లి తదితర గ్రామాల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహాం లింకన్, ఎంఈఓ ఎండీ ఫరూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

❒ వీపనగండ్ల మండల సమాఖ్య కార్యాలయంతో పాటు కల్వరాళ్ల, గోపల్‌దిన్నె, తూంకుంట పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు.

❒ పెబ్బేరు మండలంలోని యాపర్ల పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం పూర్వ విద్యార్థిని అపర్ణ రూ. 50వేల విలువైన స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం శంకర్‌గౌడ్, నరేందర్ రెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

❒ గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ పాల్గొన్నారు.

❒ ఖిల్లాఘనపురం, అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశంకర్, క్లస్టర్ హెచ్ఎం చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.


సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


పెబ్బేరు మండలం యాపర్ల ఉన్నత పాఠశాలలో..


అమరచింత జెడ్పీహెచ్ఎస్‌లో ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు


సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

గ్రంథాలయం అందుబాటులోకి వచ్చేనా?

- అమరచింత మున్సిపాలిటీగా మారినా తెరుచుకోని వైనం


అమరచింతలో నిరుపయోగంగా ఉన్న గ్రంథాలయం

అమరచింత: పట్టణంలోని గ్రంథాలయం కొన్నేళ్ల క్రితం నిర్వహణ భారంతో మూతపడింది. అమరచింత గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు కొందరు యువకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి గ్రంథాలయం పునరుద్ధరణ కోసం విరాళాలు సేకరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ గదిని కేటాయించి, ప్రతినెలా దినపత్రికలతో పాటు విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. దాతల సహకారంతో కుర్చీలు, బెంచీలను సమకూర్చారు. గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తికి గౌరవ వేతనం ఇచ్చే వీలును కల్పించారు. కొన్నేళ్లుగా ప్రస్తుతం దాతలు ముందుకు రాకపోవడంతో నిర్వహణ భారమై గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీగా మారిన అమరచింతలో గ్రంథాలయ పునరుద్ధరణను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రంథాలయం ఎప్పుడు తెరుస్తారోనని పాఠకులు, యువత ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అమరచింత మున్సిపాలిటీగా మారిన తర్వాత గ్రంథాలయానికి పూర్వవైభవం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. గ్రంథాలయానికి కేటాయించిన భవనం తలుపులు ధ్వంసం కావడంతో పర్నిచర్‌కు రక్షణ కరువైంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక వర్గం స్పందించి గ్రంథాలయం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం


సాగునీటిని విడుదల చేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్

అమరచింత: రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచనల మేరకు శుక్రవారం అమరచింత పెద్దచెరువు ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నీటి తీరువా సంఘాలు చక్కగా పనిచేశాయని.. వీటిని గత ప్రభుత్వాలు ఆదరించక పోవడంతో మరుగున పడ్డాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాగునీటి సంఘాల బలోపేతానికి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో ఆయా గ్రామాల చెరువుల్లోని నీటిని రైతులు పుష్కలంగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పోసిరిగారి విష్ణు, హన్మంతు నాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితేనే ఉత్తమ ఫలితాలు



వనపర్తి రూరల్: పరీక్షలు అంటే విద్యార్థులు భయపడొద్దని.. ప్రణాళికా బద్ధంగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ గురువయ్యగౌడ్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని చిట్యాల బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను మోటివేటర్ సి.కిరణ్‌కుమార్ వివరించారు. వార్షిక పరీక్షలపై భయం వీడి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో గ్రామసభ

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో శుక్రవారం పోలీసు పహారాలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం జీపీడీపీ వార్షిక ప్రణాళికను రూపొందించారు. గ్రామ పెద్దల సూచనల మేరకు ప్రణాళికలను సిద్ధంచేసి, ప్రభుత్వానికి పంపుతున్నట్లు కార్యదర్శి తెలిపారు. కాగా, ఎన్నడూ లేనివిధంగా పోలీసు పహారాలో గ్రామసభ నిర్వహించడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన


విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి.. అభ్యసన సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి అభ్యసన సామర్థ్యాలపై ఆరా తీశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. గ్రామ పెద్దల సహకారంతో పాఠశాల అవరణలో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తూ.. మధ్యాహ్న భోజనం తయారీకి వినియోగించడం అభినందనీయమన్నారు. అదే విధంగా పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఎంఈఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరస్వామి, పీఆర్టీయూ టీఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకటస్వామి, తిరుపతయ్య, కాశీం, శంకర్, జాకీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటిస్తేనే క్షయ నయం


వెంగళాయిపల్లిలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పాన్‌గల్: క్షయ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితేనే వ్యాధి నయమవుతుందని వైద్యసిబ్బంది సూచించారు. శుక్రవారం మండలంలోని వెంగళాయిపల్లి, జమ్మాపూర్, బండపల్లి గ్రామాల్లో క్షయ (టీబీ) నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి ఎడతెగని దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, అలసట, రాత్రిపూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు, శరీర భాగంలో లింపుగ్రంథుల వాపులు, ఛాతి ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కన్పించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు బలవర్ధక పోషకాహారం తీసుకునేందుకు గాను నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా ప్రతినెలా రూ.1000 అందిస్తారని, రోగం నయమయ్యే వరకు ప్రతినెలా అందిస్తారన్నారు. అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాంచందర్, సతీష్, మధుబాబు, రమాదేవి, శైలజ పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష


కలశం ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప స్వాములు


మహా పడిపూజలో పాల్గొన్న భక్తులు


పూజల్లో పాల్గొన్న డా. ఆదిత్య పరాశ్రీ గురూజీ

అమరచింత: హరిహరపుత్ర అయ్యప్పస్వామి శరణు ఘోషతో అమరచింత పట్టణం మార్మోగింది. అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం మహా పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామికి పల్లకీ సేవ, కలశం ఊరేగింపు నయనానందకరంగా సాగింది. పట్టణంలోని వీధుల్లో అయ్యప్ప భక్తిగీతాలు, భజనలతో భక్తులు మార్మోగించారు. అనంతరం ఆలయ ఆవరణలో మహా పడిపూజ నిర్వహించారు. ముఖ్య అతిథితులుగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, బిజ్వార్ అంబత్రేయ క్షేత్రం పీఠాధిపతి డా. ఆదిత్య పరాశ్రీ గురూజీ, నీలగిరి శాలిమఠం పీఠాధిపతి సుగూరయ్య మహరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అయ్యప్ప పడిపూజ అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు మాకం నర్సింహులు, గోపాలకృష్ణమూర్తి, భాస్కర్, కృష్ణయ్య, అంజన్‌గౌడ్, కమలాకర్‌గౌడ్, నర్సింహులుగౌడ్, మేర్వ రాజు, లచ్చన్నగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలోని 33 ఫీట్ల రోడ్లపై కొందరు ఇంటి మెట్లు ఏర్పాటు చేసుకుని కబ్జా చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధిస్తామన్నారు. తాగునీటికి ఇబ్బందులు రానీయమని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతకు అందరూ కట్టుబడి ఉండాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో వార్డు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వేద పండితులు వెంకటశేష శర్మ, సుబ్రహ్మణ్యస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సుదర్శన హోమం, లక్ష్మీ హోమం, గరుడ జ్యోతి, మహిళా భక్తులచే లక్ష్మీనారసింహస్వామికి అభిషేకం, వేదపారాయణం, జలాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.